

అలుగు వద్ద పారుతున్న నీటిలో చిన్నారుల కేరింతలు

అలుగు వద్ద ఆనంద హేళ

చెరువులు, కుంటలు అలుగులు పారుతుండడంతో వాటిని చిన్నారులకు చూపెట్టేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. అలుగులపై నుంచి జాలువారుతున్న నీటిలో చిన్నారులు మైమర్చి కేరింతలు కొడుతున్నారు. మండలంలోని సంగాయిపేట పెద్ద చెరువు వద్ద ఈ దృశ్యాన్ని బుధవారం సాక్షి తన కెమెరాలో క్లిక్ మనిపించింది.

– కొల్చారం(నర్సాపూర్)



సెల్ఫీ దిగుతున్న జనం

మత్తడిల వద్ద సందడి

భారీ వర్షాలకు చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. దీంతో అక్కడ సందడి నెలకొంది. మండలంలోని అన్ని చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. ముఖ్యంగా దొంతి కుందలమ్మ చెరువు అందాలు ప్రజలను కట్టి పడేస్తున్నాయి. అలుగు వద్ద ప్రజలు ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్నారు. శివ్వంపేట పెద్ద చెరువు బుధవారం ఉదయం నుంచి అలుగు పారుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మత్స్యకారులు గంగామ్మతల్లి తెప్పకు పూజలు చేసి చెరువులో వదిలారు.

– శివ్వంపేట(నర్సాపూర్)

క్లుప్తంగా

అమ్ముకుంట చెరువుకు గండి



చెరువు గండి పరిశీలిస్తున్న తహసీల్దార్

వెల్దుర్తి(తూప్రాన్): భారీ వర్షాలకు మాసాయిపేట మండలం నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులోని అమ్ముకుంట చెరువుకు భారీ గండి పడింది. దీంతో చెరువులోని నీరంతా దిగువకు వృథాగా పోతోంది. నీటి ఉధృతికి చెరువు కట్ట ధ్వంసమైంది. రైతులు వారి పంట పొలాలకు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఇరిగేషన్ అధికారులతో కలసి తహసీల్దార్ జ్ఞానజ్యోతి సందర్శించారు. పరిస్థితిని పరిశీలించారు. జేసీబీ సహాయంతో చెరువు గండి పూడ్చి వేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి: యూఎస్‌పీసీ

మెదక్‌జోన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 23న హైదరాబాద్ ధర్నాచౌక్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) సభ్యులు యాదగిరి, వెంకట్ రాంరెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. నూతన జిల్లాలకు డీఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేసి, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీలను భర్తీ చేయలన్నారు. సమస్యల పరిష్కారం కోసం విడతల వారీగా ఆందోళనలు చేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలన్నారు.

రోడ్డు పునరుద్ధరణ

శివ్వంపేట(నర్సాపూర్): వరదనీటి ప్రవాహానికి తెగిపోయిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మండల పరిధి ఉసిరికపల్లి– వెల్దుర్తి ప్రధాన రహదారి పోతులబోగూడ వద్ద భారీ వర్షాలకు గాను వరదనీటి ప్రవాహానికి మూడు రోజుల క్రితం రోడ్డుకు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం సంబంధిత అధికారులు కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధించారు.

మూడు పీహెచ్‌సీలు మంజూరు చేయండి

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి

పాపన్నపేట(మెదక్): మెదక్ నియోజకవర్గానికి మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పాపన్నపేట మండలం యూసుఫ్‌పేట, హవేలీఘనపూర్ మండలం బూరుగుపల్లి, రామాయంపేట మండలం కాట్రియాల్ గ్రామాలకు పీహెచ్‌సీలు మంజూరు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి: ఎస్‌ఐ శ్రీనివాస్

పాపన్నపేట(మెదక్): పండుగలు భక్తిని చాటాలి.. కానీ విషాదాలు కావొద్దని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వినాయక చవితి ఊరేగింపులు, శోభాయాత్రలు తగిన జాగ్రత్తలతో నిర్వహించుకోవాలని సూచించారు. విగ్రహాలు సాధ్యమైనంత చిన్నవిగా ఉండాలన్నారు. పరిమితికి మించి పెద్ద విగ్రహాలు తెచ్చేటప్పుడు..నిమజ్జన సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. మండపాల డెకరేషన్, సౌండ్ బాక్స్‌ల ఏర్పాట్లలో విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలన్నారు. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్‌లైన్ అనుమతి తీసుకోవాలన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

చిన్నశంకరంపేట(మెదక్): పారిశుధ్య పనులపై ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీఓ దామోదర్ సూచించారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం సీజన్ వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతంగా జరిగేలా కృషి చేయాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు, ఎంపీఓ గిరజారాణి, ఏపీఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విష జ్వరాలతో విలవిల

రోగులతో ఆస్పత్రులు కిటకిట

- రోజురోజుకు పెరుగుతున్న జ్వర బాధితులు



ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర బాధితులు

నర్సాపూర్: ప్రజలు విష జ్వరాలతో సతమతమవుతున్నారు. వర్షాకాలం సీజన్ కావడంతో నర్సాపూర్ మున్సిపాలిటీతో పాటు గ్రామాలలో దోమలు పెరిగాయి. పలు గ్రామాల్లో పారిశుధ్యం పనులు సరిగా చేయడం లేదు. ఫలితంగా దోమలు పెరగడంతో ప్రజలు విష జ్వరాలకు గురవుతున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ప్రైవేటు ఆసుపత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిత్యం సుమారు 80 మంది చికిత్సకు వస్తుండగా.. వారిలో 30 నుంచి 40 మంది ఇన్‌పేషెంట్లుగా చేరి వైద్యం పొందుతున్నారు. కాగా చిన్న పిల్లలు సైతం విష జ్వరాల బారిన పడడంతో ఇంటిల్లి పాది ఇబ్బందుల పాలవుతున్నారు. ఇదిలాఉండగా డెంగీ జ్వరం బారిన పడుతున్న వ్యక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి రెండు రోజులకు ఒక డెంగీ కేసు నమోదు అవుతుండగా ప్రైవేటు ఆసుపత్రులలో సైతం ఇలాంటి కేసులు నమోదు అవుతున్నాయని తెలిసింది. ఇదిలాఉండగా పట్టణంలోని ఓ ప్రభుత్వ వసతి గృహంలో పలువురు బాలికలు విషజ్వరాల బారిన పడినట్లు తెలిసింది. జ్వరం సోకిన బాలికలలో కొందరు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్ పేషేంట్స్‌గా వైద్యం చేయించుకుని తమ ఇళ్లకు వెళుతుండగా కొందరు హాస్టల్‌లోనే ఉంటున్నారు. కాగా ప్రభుత్వ వసతి గృహాలలో వైద్య పరీక్షలు సరిగా చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.



అవుట్ పేషెంట్ వార్డు వద్ద పిల్లలతో రోగులు

ప్యాటగడ్డలో జ్వర సర్వే



జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ప్యాటగడ్డలో వైద్యాధికారులు జ్వర సర్వే నిర్వహించారు. బుధవారం వైద్యాధికారి సాయిసింధు అధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికి తిరిగి వివరాలను నమోదు చేశారు. తీవ్ర జ్వరంతో గ్రామానికి చెందిన మాడబోయిన స్వామి మంగళవారం మృతి చెందడంతో అధికారులు జ్వర సర్వే నిర్వహించారు. స్వామి తల్లి జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అలాగే బాబాయ్ శేకులుకు డెంగ్యూ జ్వరం రాగా చికిత్స పొందాడని వైద్య సిబ్బంది తెలిపారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

రోజుకు 30 మంది జ్వరబాధితులు



తమ ఆసుపత్రికి తీవ్ర జ్వరంతో వస్తున్న వారిని ఆసుపత్రిలో చేర్చుకుని అవసరమైన వైద్యం చేస్తున్నాం. ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తూ.. రిపోర్టుల ఆధారంగా చికిత్స చేస్తున్నాం. అప్పుడప్పుడు డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. రోజుకు 30 మంది వరకు విష జ్వరాలతో ఆసుపత్రిలో చేరుతున్నారు.

– డాక్టర్ పావని, సూపరింటెండెంట్

చల్లపల్లికి రోడ్డుకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..



చల్లపల్లిలో గుంతల్లో మట్టి పోయించిన దృశ్యం

టేక్మాల్(మెదక్): భారీ వర్షాల వల్ల టేక్మాల్ మండలం చల్లపల్లి శివారులోని రోడ్డును బుధవారం బాగు చేశారు. 'తెగిన రోడ్డు'శీర్షికపై బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ స్పందించి మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సంబంధిత అధికారులకు ఫోన్లో మాట్లాడారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పీఆర్ ఏఈ గోపాల్ అక్కడకు చేరుకొని రోడ్డుకు మరమ్మతు చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిషోర్, పాపయ్య, సాగర్, మహేష్‌రెడ్డి, శ్రీకాంత్, అలీ తదితరులు ఉన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నేతలు

నర్సాపూర్: సీపీఎస్ రద్దు చేయాలన్న డిమాండుతో పీఆర్‌టీయూ సెప్టెంబరు ఒకటిన హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లాప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ కోరారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీరేశం, ఇతర ప్రతినిధులు ఇంతియాజ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ ఒకటో తేదీన నిర్వహించనున్న మహాధర్నా గోడ పత్రికను మండల పరిధిలోని జక్కన్నపేట పాఠశాలలో పీఆర్‌టీయూటీఎస్ బాధ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, రఘుబాబులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రతీ అంగన్‌వాడీలో కిచెన్ గార్డెన్

సీడీపీఓ హేమభార్గవి



కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న సీడీపీఓ హేమభార్గవి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్‌లను పెంచాలని సీడీపీఓ హేమభార్గవి అన్నారు. బుధవారం మండలంలోని రాయిలాపూర్, రాయిలాపూర్ తండా అంగన్‌వాడీ కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల ఎత్తు, బరువును పరిశీలించారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లుల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఖాళీ స్థలంలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు, మునగ, కరివేపాకు తదితర మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, సరళ, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కూలిన 16 ఇళ్లు



ఘనపూర్‌లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

తూప్రాన్: భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో 16 ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఘనపూర్‌లో 6, గుండ్రెడ్డిపల్లిలో 6, ఇమాంపూర్‌లో 2, యావపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో ఒకటి చొప్పున పెంకుటిళ్లు పాక్షికంగా కూలినట్లు తహసీల్దార్ తెలిపారు. తక్షణ సహాయం కింద బాధితులకు 20 కిలోల బియ్యం అందజేశామన్నారు. ప్రభుత్వానికి నివేదిక పంపి త్వరలో నష్టపరిహారం అందజేస్తామన్నారు.

దోమలతో జాగ్రత్త

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల అవగాహన



పెద్దచింతకుంటలో విద్యార్థుల ర్యాలీ

నర్సాపూర్ రూరల్: దోమలను నిర్లక్ష్యం చేస్తే జ్వరాల బారిన పడతారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం దోమల నివారణ దినోత్సవంలో భాగంగా పెద్ద చింతకుంటలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి దోమలతో జరిగే నష్టాన్ని వివరించారు. టైర్లు, కొబ్బరి చిప్ప, పగిలిన కుండలలో నీరు నిల్వ ఉండకుండా పారబోయాలని తెలిపారు. దోమలతో మలేరియా, చికెన్ గున్యా , డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సమీరా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ కుమార్, అధ్యాపకులు అదెప్ప, రవి కుమార్, ఆరిఫ్, చంద్రమౌళి, గణేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీరు ఎత్తిపోత

నర్సాపూర్: తమ కాలనీలోని లోతట్టు ప్రాంతంలో నిలిచిన వర్షం నీటిని కాలనీవాసులు తమ సొంత నిధులతో బుధవారం ఎత్తిపోశారు. వర్షం వస్తే నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని విష్ణేశ్వర కాలనీలో మురికి కాలువలు సరిగా లేనందున రోడ్ల మీదుగా నీళ్లు పారుతాయి. కాగా కాలనీలోని ఓపెన్ ప్లాట్లతో పాటు లోతట్టు ప్రాంతంలో వర్షం నీళ్లు నిలిచాయి. ట్రాక్టర్‌కు మోటారు పైపులు ఏర్పాటు చేసి ఎత్తిపోసే పనులు పలువురు కాలనీవాసులు చేపట్టారు. మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదని, తమ కాలనీ వైపు రాలేదని వారు ఆరోపించారు.

రసాయన ఎరువులతో అనర్థాలు

వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: రసాయన ఎరువులతో పంటలు సాగు చేస్తే కలిగే నష్టాలపై మండలంలోని రామచంద్రపూర్‌లో బుధవారం మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు రావే కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. పంటల సంరక్షణ కోసం క్లోరిపిరిపాస్, కార్బెండజిమ్, మలాథియన్ వంటి మందులను కలిపి వాడినప్పుడు పంటలపై చూపే ప్రభావంపై వివరించారు. రసాయన ఎరువుల వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అనురాధ, హాసిని, అంజలి, మౌనిక, దివ్యశ్రీ, బుష్రా షేక్, సానియాఅంజుం, ఎం. అంజలి, మనిషా, ఎం మనీషా విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

పంట నష్ట వివరాల సేకరణ

పెద్దశంకరంపేట(మెదక్): భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని ఉత్తులూర్, బుజ్రాన్‌పల్లి, పెద్దశంకరంపేటలో వరిపంట, పత్తిపంట, పెసర పంటలను వ్యవసాయ ఇన్‌చార్జి అధికారి కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, అఖిల్, వినీత్ తదితరులున్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



నర్సాపూర్: పీఏసీఎస్ వద్ద రైతుల పడిగాపులు



రంగంపేట పీఏసీఎస్ ముందు యూరియా కోసం రైతుల తిప్పలు

నర్సాపూర్: యూరియా కోసం రైతులు రోజు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం సైతం రైతులు ఆయా గ్రామాల నుంచి యూరియా కోసం నర్సాపూర్ వచ్చారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద గంటల తరబడి నిరీక్షించారు. యూరియా గురువారం వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పడంతో నిరాశతో ఇంటిముఖం పట్టారు.

కొల్చారం(నర్సాపూర్): రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం 560 బస్తాల యూరియా వచ్చింది. దీంతో రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు చొప్పున అందించారు. కొందరికి మాత్రమే యూరియా అందింది. మిగిలిన వారు నిరాశతో వెనుదిరిగారు. డిమాండ్‌కు తగ్గట్టుగా యూరియా సరఫరా చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈఓ రాజశేఖర్ రెడ్డితో వాగ్వాదానికి దిగారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

చేగుంట(తూప్రాన్): కొందరు కావాలనే యూరియా కొరతను సృష్టించాలని చూస్తున్నారని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు సెప్టెంబర్‌లో అవసరం ఉంటుందని, ముందస్తుగా ఇప్పుడే యూరియా కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో ఎరువులు వచ్చాయని వాటిని పిచికారీ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, ఆర్ఐ భరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మండపాలకు అనుమతి తప్పనిసరి**

వెల్దుర్తి(తూప్రాన్): వినాయక చవితి సందర్భంగా పందిరి, మండపాలు ఏర్పాటు చేసుకోదలచిన వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పూర్తి చేసిన తర్వాత మండప నిర్వాహకులు అప్లికేషన్ ఫారంతో పాటు కంప్యూటర్‌లో రూపొందించిన అక్నాలెడ్జ్‌మెంట్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని కోరారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించిన రోజు నుంచి నిమజ్జనం చేసే వరకు మండపాల వద్ద నిర్వాహకులు పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

◆ **ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోండి**

నర్సాపూర్: వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ లింగం అన్నారు. మండపం ఏర్పాటు చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అనుమతి పొందాలన్నారు. విద్యుత్, అగ్ని ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులు వాడాలని లింగం కోరారు. లౌడ్ స్పీకర్లు తగిన మోతాదులో వాడాలని, డీజేలను వాడవద్దని సూచించారు. పోలీసులు సూచించిన మార్గంలోనే శోభాయాత్ర చేపట్టాలని ఎస్ఐ కోరారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత**

నర్సాపూర్: ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థికంగా తోడ్పడుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ వైస్ చైర్మన్ నయిం, బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, షేక్ హుస్సేన్, శ్రీనివాస్, జగపతి, సుదీప్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సాపూర్: తన క్యాంపు కార్యాలయంలో బుధవారం పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు వెంకటేష్, మణిదీప్, హమీద్ తదితరులు ఉన్నారు.

◆ **పరిసరాల పరిశుభ్రతపై అవగాహన**

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేటలో బుధవారం పరిసరాల పరిశుభ్రతపై సాంస్కృతిక సారథి బృందం అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్కృతిక సారధి బృందం సభ్యులు ఆట పాటలతో అలరించారు.

◆ **ఘనంగా పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని యశ్వంతరావ్‌పేట గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన బుధవారం అమ్మవారికి బోనాలు ఊరేగింపు చేపట్టారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ నేత, నర్సాపూర్ నియోజకవర్గ ఇంఛార్జ్ రాజిరెడ్డి పాల్గొని బోనమెత్తుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, నర్సింహారెడ్డి, మహేశ్‌రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **22న ఉపాధి హామీ పనులు జాతర**

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 22వ తేదీన అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనుల జాతర నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుదవారం ఉపాదిహామీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో కూలీలకు పనులు కల్పించాన్నారు. మంజూరైన పనులకు ప్రొసీడింగ్ ఇచ్చి పనులు జాతర నిర్వహించాలని తెలిపారు. వనమహోత్సవంలో మొక్కలు నాటడంతోపాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు. సమావేశంలో ఏపీఓ పుణ్యదాస్, ఈసీ ప్రేంకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **కూలిన ఇళ్ల పరిశీలన**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్‌నగర్, మొండితండా, గూగ్లోత్‌తండా, కౌడిపల్లి గ్రామాలలో బుధవారం ఆర్ఐ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, వెంకటేశం తదితరులు పరిశీలించారు. వర్షాలు తగ్గే వరకు శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ప్రజలు ఉండవద్దని అధికారులు సూచించారు. సమస్య ఉంటే తెలియచేయాలన్నారు.

◆ **కూలిన విద్యుత్ స్తంభం**

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ స్తంభం కూలిపోవడంతో వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శివ్వంపేటలోని బురదబాటలోని విద్యుత్ స్తంభం బుధవారం కూలి వరి పొలంలో పడిపోయింది. స్తంభం కూలిన సమయంలో అక్కడ రైతులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్తంభం కూలడంతో పలు వ్యవసాయ బోరుబావులకు సంబంధించి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

◆ **రాజయ్య సేవలు అమోఘం..**

సిద్దిపేటజోన్: ప్రముఖ అంతర్జాతీయ చిత్రకారుడు కాపు రాజయ్య సేవలు అమోఘమని సిద్దిపేట కవులు పేర్కొన్నారు. కాపు రాజయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవులు రాజేశం, రాజ్ కుమార్, అశోక్, రాజయ్య, బాలకిషన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.